క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నాగులుప్పలపాడు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం ఉదయం మండలంలోని ఉప్పుగుండూరు కోల్డు స్టోరేజీ సమీపంలో జరిగింది. గ్రామానికి చెందిన చికెన్ షాపు నిర్వాహకుడు జెండా బాబు ఉదయం వాకింగ్ చేస్తుండగా, గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

పిన్నిక విజయమ్మకు ఘన నివాళులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ జవహర్, మారం వెంకారెడ్డి

చీమకుర్తి: ప్రజాకవిగా పేరుగాంచిన పిన్నిక శ్రీనివాసరావు సతీమణి పిన్నిక విజయమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో సోమవారం చీమకుర్తిలోని పిన్నిక ఇంటి వద్ద సంతాప సభ ఏర్పాటు చేశారు. పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బీ జవహర్, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, ఎరుకుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకుడు పేరం శ్రీనివాసరావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, విప్లవ రచయితల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ, చేనేత జన సమాఖ్య జాతీయ అధ్యక్షుడు మాచర్ల మోహన్‌రావు, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎన్ మోహన్‌కుమార్‌ధర్మ, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుడ్డు వెంకట్రావు, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు ఊటుకూరు వెంకటేశ్వర్లు, బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, నియోజకవర్గం ఇన్‌చార్జి పసుమర్తి సుధాకర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు తొరటి ఆనంద్, రైతు సంఘ రాష్ట్ర నాయకులు చుండూరు రంగారావు, షేక్ ఖాదర్ బాషా, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో బాధపడే వారిని గుర్తించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటేశ్వర్లు

ఒంగోలు సిటీ: కాన్సర్ తో బాధపడే వారిని గుర్తించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం క్యాన్సర్ సంరక్షణ పురోగతి, ఎన్‌సీడీ 4.0 కార్యక్రమంపై జిల్లాలోని సీహెచ్‌ఓలు పట్టణ, గ్రామీణ ఏఎన్‌ఎం లకు శిక్షణ ఇచ్చారు. 10 బ్యాచ్ లుగా విభజించి బ్యాచ్‌కు 28 మంది వంతున మొత్తం 464 మందికి శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి డాక్టర్ భగీరథి, మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట తప్పడమే చంద్రబాబు నైజం

- దేశంలో మోసానికి ష్యూరిటీ ఇచ్చే ధైర్యం చంద్రబాబుకే సొంతం
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు

మద్దిపాడు: ఎన్నికల ముందు బూటకపు హామీలివ్వడం, అధికారంలోకి వచ్చాక మాట తప్పడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని గార్లపాడులో సోమవారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బాబు మోసాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోసానికి కూడా ష్యూరిటీ ఇచ్చే ధైర్యం ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. ఇంటి ముంగిటకే వచ్చి ఇచ్చే రేషన్ బియ్యాన్ని రేషన్ డిపోలకు అప్పగించి ప్రజలందరికీ వ్యయప్రయాసల్ని పెంచేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమాన్ని అందించాలే తప్ప మోసం చేసి ఇబ్బంది పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, గార్లపాడు సర్పంచ్ దేవరపల్లి గంగిరెడ్డి, గ్రామ వైస్ ప్రెసిడెంట్, ముత్తనపల్లి సుబ్బారావు, గార్లపాడు అధ్యక్షుడు మౌలాలి, దేవరపల్లి వెంకటరెడ్డి, రావూరి ప్రసన్నాంజనేయరెడ్డి, నందవరపు మస్తాన్, కంకణాల సురేష్, పల్లంరెడ్డి బాలాంజనేయరెడ్డి, సన్నపురెడ్డి రవణమ్మ, నాదెండ్ల మహేష్, రాయపాటి విల్సన్, అనపర్తి చిరంజీవి, కందుల వెంకటేష్, అనపర్తి కొండలు, దాశరధి యాదయ్య, ఏమని బుల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూచేపల్లి వెంకాయమ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు



బూచేపల్లి వెంకాయమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న దుంపా రమణమ్మ, ఎం.గౌరిసురేష్‌రెడ్డి

చీమకుర్తి: జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు సంతనూతలపాడు జెడ్పీటీసీ సభ్యురాలు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, రాష్ట్ర మహిళా జోనల్ అధ్యక్షురాలు, ఒంగోలు కార్పొరేటర్ ఎం.గౌరిసురేష్‌రెడ్డి సోమవారం ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. చీమకుర్తిలోని బూచేపల్లి వెంకాయమ్మ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లను కలిసిన జోనల్ ఇన్‌చార్జ్ గౌరి



చుండూరి రవిబాబును సన్మానిస్తున్న గౌరిసురేష్‌రెడ్డి, నాయకులు



బత్తుల బ్రహ్మానందరెడ్డిని సన్మానిస్తూ...

ఒంగోలు సిటీ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డిని పార్టీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరిసురేష్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జ్‌లను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఆమె వెంట పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, మద్దిపాడు ఎంపీపీ వాకా కోటిరెడ్డి, ఎస్.రమణమ్మ, మొయిళ్ల సురేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లో మహిళా విభాగం క్రియాశీలకంగా పాల్గొనాలని చుండూరి రవిబాబు, మేరుగు నాగార్జున, బత్తుల బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేస్తున్న అన్యాయాలు, అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

బస్ సౌకర్యం కల్పించాలని వినతి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని మంగమూరు, ఎనికపాడు గ్రామాలకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు సోమవారం ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రతిరోజూ వందలాదిమంది ప్రజలు పనుల నిమిత్తం ఒంగోలు వస్తుంటారని, కానీ, ఆర్టీసీ బస్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు, కాలేజీ విద్యార్థులు నిత్యం ఒంగోలు వస్తుంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించిందని, కానీ, గ్రామాలకు బస్‌లు రాకపోతే వారు ఆ సౌకర్యాన్ని ఉపయోగించుకోలేక పోతున్నారని తెలిపారు. దీనిపై ఆయా గ్రామాల్లో సంతకాలు సేకరించి వినతిపత్రం సమర్పించారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి ఆర్టీసీ ఆర్‌ఎంతో మాట్లాడి రూటును పరిశీలించి రెండు రోజుల్లో బస్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ మస్తాన్, టి.రాము, పి.సుబ్బారెడ్డి, ఎస్వీ నరసింహం, ఎం.శ్రీనివాసరావు, జే కోటేశ్వరరావు, టీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల తీరుతో వ్యవసాయానికి రైతులు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న పమిడి వెంకట్రావు

నాగులుప్పలపాడు: కార్పొరేట్ కంపెనీలకు భూములను కట్టబెడుతూ ప్రజలకు అన్నం పెట్టే రైతన్నలను వ్యవసాయానికి దూరం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఉన్నాయని రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.జయంతిబాబు, పమిడి వెంకట్రావు ధ్వజమెత్తారు. సోమవారం నాగులుప్పలపాడులో రైతు సంఘ మండల మూడో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతిబాబు, వెంకట్రావు మాట్లాడుతూ పరిశ్రమల పేరుతో రాష్ట్రంలో వేలాది ఎకరాలను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేశారని విమర్శించారు. ఆయా భూముల్లో ఎక్కడా ఒక్క ఫ్యాక్టరీ కూడా స్థాపించిన దాఖలాలు లేవన్నారు. కార్పొరేట్ సంస్థలు ఆ భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొంది వ్యాపారం చేస్తున్నాయన్నారు. తిరిగి వారికే ప్రభుత్వం వేలాది కోట్లు రుణమాఫీ చేస్తోందని విమర్శించారు. అదే రుణమాఫీ రైతులకు చేస్తే.. వారికున్న అప్పులన్నీ ఒకేసారి రద్దు చేసి వ్యవసాయాన్ని కాపాడవచ్చని తెలిపారు. అలా చేయాలని రైతు సంఘాలు కోరుతున్నప్పటికీ ఆవైపుగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ ఏడాది కంపెనీల ప్రోత్సాహంతో ఎక్కువ శాతం బర్లీ పొగాకును రైతులు సాగుచేశారని తెలిపారు. తీరా పంట చేతికొచ్చిన తర్వాత కంపెనీలు కొనుగోలు చేయకపోవడంతో రైతు సంఘాల ఆందోళన ఫలితంగా ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా రంగంలోకి దిగి రెండు నెలల నుంచి కొనుగోలు చేసినప్పటికీ సగం మాత్రమే కొనుగోలు జరిగిందన్నారు. మిగిలిన వారి సీరియల్ రాక కొనుగోలు కేంద్రానికి చేరుకోలేదన్నారు. దాంతో రైతాంగం నష్టాలబాట పడుతున్నారని తెలిపారు. వెంటనే రైతుల వద్ద ఉన్న నల్ల బర్లీ పొగాకును చివరి ఆకు వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వర్జీనియా లోగ్రేడ్‌ను రూ.20 వేలకు కొనుగోలు చేయాలన్నారు. మాగాణి సాగు గిట్టుబాటు కాక రైతులు వ్యవసాయం చేయడానికి ముందుకు రాక ధాన్యం ఉత్పత్తి గణనీయంగా తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో తిండిగింజల కొరత ఏర్పడిందన్నారు. రానున్న కాలంలో మరింత కొరత పెరిగి తిండిగింజలు దొరక్క ఆకలి చావులు ప్రబలే ప్రమాదముందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఒక్కపర్యాయమే రైతుల మొత్తం రుణ బకాయిలు రద్దు చేసి వ్యవసాయాన్ని నిలబెట్టాల్సిన అవసరం ఉందన్నారు. లేకుంటే రైతాంగమంతా పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా టి.శ్రీకాంత్, రావెళ్ల వెంకట్రావు, మెంబర్లుగా దాసరి ఆంజనేయులు, పి.హనుమంతరావు, పి.జనార్దన్, పాలపర్తి యోనా, చుండూరి శ్రీరామ్మూర్తి, జట్టి హజరత్తయ్య, జె.సుబ్బారెడ్డి, కాకాని సుబ్బారావు, గడ్డం ఏలియ్య, గాదె నాగేశ్వరరావు, నార్నె చెంచయ్య, మారెళ్ల వెంకట్రావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దేవాలయం భూమి స్వామివారికే చెందాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని మన్నవారిపాలెంలోని సీతారామస్వామి దేవాలయం భూమి అన్యాక్రాంతం అయిందని, ఆ భూమి స్వామివారికి మాత్రమే చెందేలా చూడాలని సోమవారం ఒంగోలులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు నిడమానూరు మాలకొండయ్య అర్జీ అందించారు. సీతారామస్వామి కై ంకర్యాలు జరుపుటకు తమ పెద్దలు ఉమ్మడి కుటుంబం తరఫున 1952లో మండలంలోని గంగవరం గ్రామంలోని సర్వే నంబర్ 1237లో 0.98 ఎకరాల భూమిని స్వామివారి పేరున గిఫ్టుగా (నంబర్ 1069-1952, తేదీ 11.12.1952) రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అదేవిధంగా 24.08.1969న మండలంలోని ఎండ్లూరు సర్వే నంబర్ 345లో 3.50 ఎకరాల భూమిని స్వామివారి పేరున రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఆ భూమి ప్రస్తుతం అన్యాక్రాంతం అయిందని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని స్వామివారికే భూమి చెందేలా చూడాలని కోరారు.

క్యాస్ట్ వెరిఫికేషన్‌కు సహకరించండి

చీమకుర్తి: కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కులాలకు చెందిన 14,939 మందికి సంబంధించిన కులాల వెరిఫికేషన్ చేయాలని చీమకుర్తి తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి కులాలను సంబంధిత అధికారులు విచారించే సమయంలో అవగాహన లేక కొంత మంది ప్రజలు సహకరించటం లేదన్నారు. విచారణ అనంతరం వారి కులాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సర్టిఫికెట్లు పొందే వీలుంటుందన్నారు. విచారణకు వచ్చే రెవెన్యూ సిబ్బందికి తమ వంతు సహకారం అందించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

మెడిసిన్ విద్యార్థినికి ఆర్థికసాయం

చీమకుర్తి: కాకినాడ ప్రభుత్వ రంగరాయ మెడికల్ కాలేజీలో సీటు సాధించిన కొమ్ము సమీక్షను సోమవారం చీమకుర్తిలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ అభినందించారు. ఎలాట్‌మెంట్ లెటర్ డౌన్‌లోడ్‌కు అవసరమైన రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండర్లకు గుర్తింపు కార్డులివ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఒంగోలు నగర స్ట్రీట్ వెండర్లు

ఒంగోలు సిటీ: నగరంలోని స్ట్రీట్ వెండర్లకు గుర్తింపు కార్డులివ్వాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.రమేష్ డిమాండ్ చేశారు. ఒంగోలు నగర స్ట్రీట్ వెండర్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవనం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ ఇచ్చిన కార్డులను రెన్యువల్ చేయాలన్నారు. నగరంలో అనేక రోజుల నుంచి గుర్తింపు కార్డులను రెన్యువల్ చేయడం లేదన్నారు. కొత్తగా కార్డులివ్వకుండా మెప్మా ఆఫీస్ ఆపివేయడం అన్యాయమన్నారు. కార్డు లేని కారణంగా ఆశీ కాంట్రాక్టర్లు స్ట్రీట్ వెండర్లను ఇబ్బందిపెడుతున్నారని, అదేవిధంగా పోలీసులు కూడా రోడ్డు మీద బండ్లు ఉంచకుండా కార్డులు లేనివారిని ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. కార్డు లేని కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వారికి కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. గతంలో స్ట్రీట్ వెండర్లను గ్రూపులుగా చేసి లోన్లు ఇవ్వటం జరిగిందని, మళ్లీ ఆ లోన్‌లు అందరికీ ఇప్పించి వారి వ్యాపారం కోసం తోడ్పడాలని కోరారు. అనంతరం ఒంగోలు మెప్మా పీడీకి అర్జీ అందించారు. కార్యక్రమంలో స్ట్రీట్ వెండర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎం.లక్ష్మీనారాయణ, వంశీ, మాధవ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు



ఎస్పీతో ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు సిటీ: ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు సోమవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని విలేజ్, వార్డు సెక్రటేరియట్‌లలో పనిచేస్తున్న మహిళా పోలీసుల సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎస్పీ.. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో మహిళా పోలీసుల బదిలీల్లో జరుగుతున్న ఆలస్యాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా, బదిలీల్లో ఉన్న అవరోధాలను అతి త్వరలో తొలగించి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శరత్‌బాబు, జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్టారెడ్డి, ఒంగోలు నగర కార్యదర్శి షేక్ మగ్దుంషరీఫ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కోటేశ్వరమ్మ, సీహెచ్ శిరీష, ఎస్పీ కార్యాలయ ప్రతినిధి అశ్విని తదితరులు ఉన్నారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న ఎన్నికల కమిషన్



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బీజేపీ అపహాస్యం చేస్తోందని, ఎన్నికల కమిషన్ మొత్తం బీజేపీ ఎన్నికల కమిషన్‌లా మారిపోయిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్కే సైదా అన్నారు. ఓట్ల దొంగ, సీట్ల దొంగ గద్దె దిగు అనే పేరుతో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు నగరంలో ర్యాలీ నిర్వహించగా, సైదా మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో 65 లక్షల ఓట్లను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవహరించి తొలగించిందన్నారు. ప్రతిపక్ష నేతలు, ప్రజా గళాల గొంతునొక్కడమే పనిగా బీజేపీ పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుల ఐక్యతపై మోదీ, బీజేపీ కుట్ర

- చంద్రబాబు పాత్రధారి
- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రత్నాకర్

ఒంగోలు వన్‌టౌన్: దేశంలోని దళితుల ఐక్యతపై ప్రధాని మోదీ, బీజేపీ కుట్ర చేస్తున్నాయని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్ విమర్శించారు. సోమవారం ఒంగోలు వచ్చిన ఆయన.. స్థానిక మీడియా కెమెరామెన్ అసోసియేషన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ కుట్రను రాష్ట్రంలో చంద్రబాబు అమలు చేస్తున్నాడన్నారు. మాల సామాజికవర్గాన్ని తొక్కేసే కార్యక్రమాన్ని చంద్రబాబు భుజాన వేసుకుని నడిపిస్తున్నాడన్నారు. మతాన్ని, కులాన్ని రెచ్చగొట్టి దేశాన్ని అమ్ముకునే పనిలో మోదీ ఉన్నాడన్నారు. ఎలక్షన్ కమిషన్‌ను తన పావుగా వాడుకుని అడ్డదారిలో బీజేపీ గెలిచిందన్నారు. దేశంలో అన్ని రాజ్యాంగ వ్యవస్థలను మోదీ నిర్వీర్యం చేశాడన్నారు. ప్రభుత్వాన్ని రద్దు చేసి బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించి గెలిచి చూపించాలని బీజేపీని కోరారు. తెలంగాణలో కూడా అక్కడి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాలలపై విషం చిమ్ముతున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాలలపై కక్ష్య సాధింపును విరమించుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణను మార్చేందుకు పార్లమెంటులో చట్టం చేసేంత వరకూ నిరంతరం ఉద్యమం చేస్తామన్నారు. 11 మంది జడ్జిల బెంచ్ ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇచ్చేంత వరకూ ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో చప్పిడి రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

మీ కోసం కార్యక్రమానికి పోటెత్తిన జనం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, డీఆర్వో

ఒంగోలు సబర్బన్: స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు పోటెత్తారు. వందల సంఖ్యలో క్యూ కట్టి సమస్యలపై కలెక్టర్, అధికారులకు వినతిపత్రాలు అందించారు. దివ్యాంగులు సైతం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి మీ కోసం కార్యక్రమానికి వచ్చి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్ఓ ఓబులేసు, ఇతర అధికారులకు అర్జీలు అందించారు. మండల, గ్రామ స్థాయిలోని సమస్యలను కూడా అక్కడి అధికారులు పరిష్కరించకుండా పదేపదే తిప్పుకుంటున్నారని జిల్లా అధికారుల దృష్టికి బాధితులు తీసుకొచ్చారు.

వ్యానుతో పోలీసులను ఢీకొట్టిన దొంగ

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): కోడిగుడ్ల వాహనంతో పారిపోతున్న దొంగను పట్టుకునేందుకు వెళ్లిన సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఆ వాహనంతో దొంగ ఢీకొట్టాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చీమకుర్తి జవహర్ హాస్పిటల్ సమీపంలో కోడిగుడ్ల వ్యాన్ ఆపి డ్రైవర్ షాపులోకి వెళ్లిన సమయంలో ఓ గుర్తు తెలియని ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఆ వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. ఆ వాహనం సంతనూతలపాడు వైపు వస్తుందని, పట్టుకోవాలని చీమకుర్తి పోలీస్ స్టేషన్ నుంచి సమాచారం అందడంతో సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ వద్ద సదరు పోలీసులు ఆపడానికి ప్రయత్నించారు. కానీ, ఆ దొంగ వాహనం ఆపకుండా పరారయ్యే క్రమంలో హెడ్ కానిస్టేబుల్ షరీఫ్ అహ్మద్, కానిస్టేబుల్ నారాయణ రెడ్డిని ఢీకొట్టి వెళ్లిపోయాడు. వారిని ఒంగోలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా, సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు సోమవారం పరామర్శించారు. నిందితుడు ఒరిశాకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు.